సాక్షి ప్రకాశం

ఆదివారం । 16 । జూన్ । 2024



ఆరోగ్య చిరులు

చిరుధాన్యాలతో ఆరోగ్యప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. పత్తికి ప్రత్యామ్నాయంగా కొర్రల సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో దిగుబడి ఎక్కువ వస్తుంది.

- 8లో..



మద్యం మత్తులో కార్పెంటర్ మృతి

నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు మృతిచెందిన ఘటన కంభంలో శుక్రవారం జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం

39.1/29.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.



సూర్యోదయం వేళ బోటులో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు



సముద్రంలోకి బోటుతో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు

నడిసంద్రాన.. ఆశల వల

తూరుపున తొలి కిరణం ఇలను తాకకముందే.. ఆటుపోటుల కెరటాలు దాటి.. ఆశల వల విసురుతూ.. నడిసంద్రాన సంపద ఒడిసిపట్టిన మత్స్యకారులు ఉత్సాహంగా తీరం చేరారు. సముద్రంలో సుదీర్ఘ వేట విరామం తరువాత మత్స్యకారులు శనివారం మళ్లీ వేట మొదలుపెట్టారు. ఈ ఏడాదంతా వలనిండా మత్స్యసంపద పడాలని పడవలకు పసుపు, కుంకుమతో పూజించి టెంకాయలు కొట్టి వేట సాగించారు. జిల్లాలోని తీరప్రాంత గ్రామాలైన కె.పల్లెపాలెం, గుండమాల, పిన్నింటివారిపాలెం, కొత్తపట్నం, గవళ్లపాలెం, స్వర్ణాంధ్రపట్టపు పాలెం, చిన్నపాలెం, పెద్దపాలెం, ఈతముక్కల పల్లెపాలెం, మడనూరు, పాకలలో పడవలకు పూజలు చేసి వేటకు వెళ్లారు. ఒక్క కొత్తపట్నం మండల పరిధిలోనే 826 పడవలు సముద్రంలోకి వేటచేసేందుకు వెళ్లాయి. కొన్ని పడవలు సూర్యోదయానికి ముందే పయనమవగా, కొన్ని ఉదయం వేటకు వెళ్లాయి. 61 రోజులు పడవలు, వలలు, ఇంజన్లు మరమ్మతులు చేసుకున్న మత్స్యకారులు వల నిండా సంపద పడాలని సముద్రానికి మొక్కుకుంటూ వేటకు సాగారు. తొలిరోజు స్వల్పంగానే మత్స్య సంపద పడింది.

- కొత్తపట్నం



వల నుంచి చేపలను వేరు చేసుకుంటున్న మత్స్యకారులు



మత్స్యసంపద



చేపల వేట ముగించుకొని ఒడ్డుకు వస్తున్న మత్స్యకారులు





బోటు నుంచి చేపలను ఒడ్డుకు చేర్చుకుంటున్న మత్స్యకారులు

మనోభావాలు దెబ్బతినకుండా చూడాలి



బక్రీద్ పండుగ నిర్వహణపై సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

- అక్రమ పశు రవాణా అరికట్టేందుకు చర్యలు
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా మంచి వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. ఈ నెల 17వ తేదీ బక్రీద్ పండుగ దృష్ట్యా ముస్లిం, హిందూ మత పెద్దలు, పలు శాఖల జిల్లా అధికారులతో శనివారం ప్రకాశం భవనంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. బక్రీద్ నేపథ్యంలో జంతువధ, జిల్లా పరిస్థితులు, గతంలో జరిగిన సంఘటనలపై సమీక్షించి ఎటువంటి ఉద్రిక్తతలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా, ఓవర్‌లోడింగ్ కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిలో రవాణా, పశుసంవర్ధక, పోలీసు, రెవెన్యూ శాఖల నుంచి ఒక్కో ఉద్యోగి ఉండేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. గతంలో ఘర్షణలకు దారితీసిన ప్రాంతాలపై మరింత దృష్టి సారించామన్నారు. పారిశుధ్య పనులకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. వెటర్నరీ డాక్టర్లంతా ఆది, సోమవారాల్లో ఆయా మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. మాంసాహారం తినడం, ఏవైనా కారణాలతో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. చెక్ పోస్టుల వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను గుర్తిస్తే బక్రీద్ ముగిసే వరకు వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు, మత పెద్దలు అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు. జిల్లాలో తొలుత మున్సిపాలిటీల్లోని శాశ్వత ప్రాతిపదికన కబేళాలు, చేపల మార్కెట్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపేలా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.

ప్రత్యేక కంట్రోల్ సెంటర్

బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమంగా పశువుల రవాణా, జంతువధను గుర్తించినా, వైద్య, పోలీసు సహాయం అవసరమైనా, పారిశుధ్య పనుల్లో లోపాలు గుర్తించినా నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జేసీ సూచించారు. అందుకోసం 24 గంటలు పనిచేసేలా ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో 70934 72086, 80962 57844 నంబర్లతో కంట్రోలు రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, డీటీసీ సుశల, డీపీవో ఉషారాణి, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, ఓఎంసీ కమిషనర్ జస్వంత్‌రావు, కనిగిరి, దర్శి, మున్సిపల్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాకు విద్యార్థుల ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఉపకార వేతనానికి ఎంపికై స్కాలర్‌షిప్ నమోదు కాని విద్యార్థులు వెంటనే తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని డీఈవో డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఎంపికై స్కాలర్‌షిప్ జమకాని విద్యార్థుల వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచుతారన్నారు. జాబితాలో పేరు ఉన్న విద్యార్థి వెంటనే వారి బ్యాంకు ఖాతాకు వారి ఆధార్‌ను సీడింగ్ చేయించుకుని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నగదు జమయ్యేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుంటే ఉపకార వేతనం జమకాదన్నారు. దీనికి విద్యార్థి, వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, విద్యార్థి లాగిన్‌లోని స్టేటస్ ప్రింటు తీసుకుని సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఖచ్చితంగా ఆధార్ సీడ్ చేయమని అడిగి చేయించుకోవాలన్నారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ వారే నేరుగా విద్యార్థి ఆధార్ నంబర్‌కు సీడ్ అయిన బ్యాంకు ఖాతాలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఉపకార వేతనం జమచేస్తారన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

24 నుంచి డీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, పరీక్షలు 27వ తేదీ వరకు మైనంపాడు డైట్ కాలేజీలో జరుగుతాయన్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

24 నుంచి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో నిరుద్యోగ యువతులకు మగ్గం వర్క్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ పి.ప్రతాప్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి శిక్షణ మొదలవుతుందని, ఆసక్తి కలిగిన 18 నుంచి 45 సంవత్సరాల వయసున్న మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజనంతో పాటుగా వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8247387644కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

నిలకడగా పొగాకు ధర

- గరిష్టంగా కేజీ రూ.332

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరిధిలో పొగాకు ధరలు నిలకడగా సాగుతున్నాయి. రీజియన్ పరిధిలో శనివారం 7612 బేళ్లు రాగా, 7038 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 574 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 82వ రోజు వేలం పాటలో 4540 బేళ్లు రాగా, 4225 బేళ్లు కొనుగోలు చేశారు. 315 బేళ్లు తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.332 కాగా, కనిష్టంగా రూ.204 సరాసరి రూ.280.18 వచ్చినట్లు పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు చెప్పారు. డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 3072 బేళ్లు రాగా, 2813 బేళ్లు కొనుగోలయ్యాయి.

నారసింహునికి బ్రహ్మోత్సవ శోభ

- నేడు పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- 12 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలు



యోగానంద నరసింహస్వామి



వరాహ లక్ష్మీనరసింహస్వామి

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన దక్షిణ సింహాచలంగా పేరు గాంచిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నేటి నుంచి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి సంవత్సరం వైఖానస ఆగమ ప్రకారం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నాడు బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు 26వ తేదీ బుధవారం జరిగే పుష్పయాగంతో ముగుస్తాయి.

ఆలయ ప్రాశస్త్యం ఇదీ..

పురాణ ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో యోగానంద లక్ష్మీ నరసింహస్వామి, వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి. నారదమహాముని తపస్సుతో యోగానంద లక్ష్మీనరసింహస్వామి కొండ మీద వెలసినట్లు పురాణాలు చెబుతున్నాయి. కృత యుగంలో సముద్రుడు ఉగ్రరూపం దాల్చి గ్రామాలకు గ్రామాలు ముంచి వేయడంతో సముద్రుడిని శాంతింపజేయడానికి నారదమునీశ్వరుడు నరసింహస్వామి గురించి తపస్సు చేయగా ఇతని తపస్సుకు మెచ్చి నారసింహుడు కొండపై వెలిసి సముద్రుడిని శాంతింపజేశాడని పురాణాలు చెబుతున్నాయి.

వరాహలక్ష్మీ నరసింహస్వామిని ప్రతిష్ఠించిన శ్రీరామచంద్రుడు:

శ్రీరామచంద్రుడు రావణ సంహారం చేసిన తరువాత సీతాదేవిని వెంటబెట్టుకుని అయోధ్యకు వెళ్లే క్రమంలో మార్గం మధ్యలో పాతసింగరాయకొండ ప్రాంతానికి చేరుకున్నాడు. ఆ సమయంలో సీతాదేవి బహిష్ఠు కావటంతో నాలుగు రోజులు కొండపై బసచేశాడు. అక్కడే వరాహ లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠించాడు. అప్పటి నుంచి కొండపై యోగానంద నరసింహస్వామి యోగమూర్తిగా, వరాహ లక్ష్మీనరసింహస్వామి భోగమూర్తిగా వెలుగొందుతున్నారని మరో కథనం ప్రచారంలో ఉంది. ఈ క్షేత్రంలోని భవనాశి, ముక్తి భవనాశి కోనేరులకు కూడా పురాణ చరిత్ర ఉంది. ఇంద్రుని వజ్రాయుధం జారిపడటంతో ముక్తి భవనాశి ఏర్పడిందని ప్రతీతి. ఈ క్షేత్రంలోని గాలిగోపురాలను శ్రీ కృష్ణదేవరాయలు నిర్మించినట్లు ఇక్కడ రాతిపై చెక్కిన శాసనాలు ద్వారా తెలుస్తోంది.

తాతస్వామిగా పేరుగాంచిన యోగానంద లక్ష్మీనరసింహస్వామి:

సుమారు 150 ఏళ్ల క్రితం స్వామివారికి ప్రతి శనివారం అర్చకులు కైంకర్యాలు నిర్వహించేవారు. ఒకరోజు అర్చకుడు తన మనవడిని తీసుకుని గుడికి వచ్చాడు. ఆ సమయంలో మనవడు ఆడుకుంటూ యోగానందస్వామి ఆలయ గర్భగుడిలో నిద్ర పోయాడు. ఇది గమనించని అర్చకుడు ఎప్పటిలాగే సాయంత్రం గుడి తలుపులు వేశాడు. ఆచారం ప్రకారం ఒకసారి గుడి తలుపులు మూశాక మళ్లీ శనివారం వరకు గుడి తెరిచేవారు కాదు. మనవడి గురించి అర్చకుడు ఎంత వెతికినా కనబడలేదు. తరువాత ఆలయంలో నుంచి పిల్లవాడి ఏడుపు వినబడింది. ఆచారం ప్రకారం గుడి తలుపులు తీయకూడదు. దీంతో చేసేది లేక దేవునిపై భారం వేసి వెళ్లి మళ్లీ శనివారం వచ్చి గుడి తలుపులు తెరిచాడు. గుడి లోపల మనవడు ఆడుకుంటూ కనబడటంతో ఆనందంతో మనవడిని ఎత్తుకుని ఇన్ని రోజులు గుడిలో ఒక్కడివే ఎలా ఉన్నావని అడిగాడు. దీంతో మనవడు నేను ఒంటరిగా లేను తోడుగా తాత ఉన్నాడు. నాకు ప్రతిరోజు దద్ధోజనం తినిపించేవాడు అని సమాధానం చెప్పాడు. దీంతో అప్పటి నుంచి తాత స్వామిగా యోగానంద లక్ష్మీనరసింహస్వామి ప్రఖ్యాతి గాంచాడు. అప్పటి నుంచి ప్రతి రోజు స్వామివారికి బాలభోజనం కింద దద్ధోజనం నైవేద్యంగా పెట్టేవారు. ప్రతి శనివారం స్వామివారికి అన్ని రకాల కైంకర్యాలు జరుపుతున్నారు. బ్రహ్మోత్సవాలు, పండుగ రోజుల్లో మొట్టమొదటగా నేటికి యోగానందస్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు. యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సంతాన వేణుగోపాలస్వామి, లక్ష్మీదేవి, రంగనాయకస్వామి, లక్ష్మీనారాయణ స్వామి, లక్ష్మీ నరసింహస్వాముల దేవతామూర్తులు కొలువై ఉన్నారు. ఈ పరివార దేవతామూర్తులకు ప్రత్యేక రోజుల్లో మాత్రమే కైంకర్యాలు చేస్తారని ఆలయ అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. ఈ ఆలయంలో నుంచి మాలకొండ దేవస్థానానికి సారంగ మార్గం ఉంది. ఈ సారంగ మార్గం స్వామివారికి ఎడమవైపు ఉంటుంది.

యోగానంద నరసింహస్వామికి కప్పం కట్టిన బ్రిటీష్‌వారు:

బ్రిటీష్ వారి కాలంలో బోట్లు ఊళ్లపాలెం సముద్ర తీరప్రాంతానికి రాగానే హఠాత్తుగా తగలబడేవి. ఈ బోట్లు ఎందుకు తగలబడుతున్నాయో ఎవరికీ అంతుచిక్కలేదు. దీనిపై బ్రిటీష్‌వారు పరిశోధించగా వారికి యోగానంద నరసింహస్వామి ఆలయం కనబడింది. స్వామి వారికి ఎదురుగా సముద్రం కనబడుతుండటంతో ఈ అనర్థాలు జరుగుతున్నాయని పసిగట్టి ఆలయ ముఖద్వారాన్ని పక్కకు జరిపి సముద్రం కనబడకుండా నిర్మించటంతో అప్పటి నుంచి బోట్లు తగలబడటం ఆగింది. ఆలయ ముఖద్వారం జరిపినందుకు జరిమానాగా ప్రతి సంవత్సరం ఒక్క రూపాయి చొప్పున బ్రిటీష్ వారు దేవాలయానికి కప్పం కట్టేవారు. ఈ ప్రకారం వారు పరిపాలించినంత కాలం కప్పం కట్టారని ఆలయ రికార్డుల్లో ఉందని ఆలయ అధికారులు తెలిపారు.

కొండపై వెలిసిన ఆంజనేయస్వామి:

ఈ కొండపై మరో ప్రత్యేకత ఉంది. కొండపై ఆంజనేయస్వామి స్వయంభువుగా వెలిశారు. నేటికీ రాతిపై ఆంజనేయస్వామి రూపం స్పష్టంగా కనిపిస్తుంది. కొండపై ఆలయం నిర్మించడంతో ప్రతిరోజు ఆంజనేయస్వామి పూజలు అందుకుంటున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు:

స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి 8 గంటలకు అంకురార్పణతో ప్రారంభం కాగా 17వ తేదీ ఉదయం 10 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 10 గంటలకు చంద్రప్రభ వాహనం, 18వ తేదీ ఉదయం 10 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 10 గంటలకు హంసవాహనం, 19వ తేదీ రాత్రి 10 గంటలకు శేషవాహనం, 20వ తేదీ రాత్రి 10 గంటలకు హనుమంతసేవ, 21వ తేదీ ఉదయం 10 గంటలకు మోహిని ఉత్సవం, రాత్రి 11 గంటలకు గరుడసేవ, 22వ తేదీ రాత్రి 9 గంటలకు వసంతోత్సవం, 10 గంటలకు గజోత్సవం, 23వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు కళ్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం, 24వ తేదీ సోమవారం రాత్రి 10 గంటలకు గుర్రపు వాహనం, 25 వతేదీ ఉదయం 10 గంటలకు లక్ష్మీసంవాద ఉత్సవం, 11 గంటలకు చక్రస్నానం, రాత్రి 10 గంటలకు ధ్వజావరోహణ-పూర్ణాహుతి, 26వ తేదీ రాత్రి 10 గంటలకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల సమయంలో ప్రతిరోజు ఉదయం స్వామివారికి చప్పరసేవ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి పీ కృష్ణవేణి వివరించారు.

ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు:

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా శ్రీ కృష్ణ యాదవ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో 19వ తేదీ పొట్టేలు పందెం, 20వ తేదీ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు, 21వ తేదీ రాధాడు పోటీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు సత్యహరిశ్చంద్ర, భక్త చింతామణి పౌరాణిక నాటకాలు, చండీమేళం, కోలాట ప్రదర్శన, పాటకచ్చేరి, శ్రీ రామాంజనేయ యుద్ధం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం

క్లుప్తంగా

దారి దోపిడీ

- వ్యక్తిని గాయపరిచి రూ.60 వేలు నగదు, సెల్‌ఫోన్‌తో ఉడాయింపు

దొనకొండ: దొనకొండ–ఇండ్లచెరువు మధ్య శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దారి దోపిడీకి పాల్పడ్డారు. బాధితుడు శ్రీరాం కాశయ్య తెలిపిన వివరాల మేరకు.. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన శ్రీరామ్ కాశయ్య దొనకొండ బస్టాండ్ సెంటర్‌లో పండ్ల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ప్రతి రోజూ వ్యాపారం ముగించుకుని ఇండ్లచెరువు వస్తుంటాడు. ఈ క్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పసిగట్టి దారి దోపిడీకి దిగారు. కాశయ్యపై దాడి చేసి అతని దగ్గర ఉన్న రూ.60 వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని వెళ్ళారు. కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎల్. సంపత్‌కుమార్ తెలిపారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన రమేష్

పీసీపల్లి: బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని నేరేడుపల్లికి చెందిన స్వర్ణ రమేష్ (30) బైక్‌పై పీసీపల్లి నుంచి నేరేడుపల్లికి వెళ్తున్నాడు. దారి మధ్యలో బైక్ జారడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో రమేష్ తీవ్రగాయాలు కావడంతో మృతి చెందాడు. కాగా మృతుడికి భార్య ఉంది.

ఆరోగ్య చిరులు


కొర్రలు


ఓబుల్‌రెడ్డిపల్లెలో సాగు చేసిన కొర్ర పంట (ఫైల్)

రమేష్‌కు (పేరు మార్చాము) జీర్ణకోశ సంబంధిత రోగాలతో పాటు బీపీ, షుగర్ వంటివి ఉండనే ఉన్నాయి. ఎంతో కాలంగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయల మేర నెలవారీ మందులు కొంటున్నాడు. అయితే మన అవ్వా తాతల ఆహార నియమాలు ఎందుకు పాటించకూడదనే ఆలోచన వచ్చింది. వెంటనే చిరుధాన్యాలైన కొర్రలు, ఆరికలు, సామలు వంటి వాటితో పాటు తటస్థ ధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలను పూర్తి ఆహారంగా మార్చుకున్నాడు. ఇలా సంవత్సరం దాటిత తర్వాత అతని ఆరోగ్యం మెరుగైంది. ఆ తర్వాత వ్యాధులన్నీ అదుపులోకి వచ్చాయి. ఇలాంటి చిరుధాన్యాల్లో ఒకటైన కొర్ర పంట రాచర్ల మండలంలో రైతులు పండిస్తున్నారు. తక్కువ నీటి అవసరంతో.. తక్కువ కాల వ్యవధిలో.. పురుగూ పుట్రా సమస్యలు లేకుండా ఆనందంగా కొర్రల సాగు చేస్తున్నారు. సాగు పద్ధతులపై వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ పలు సూచనలు చేశారు.

- చిరుధాన్యాలతో విశేష ఆరోగ్య ప్రయోజనాలు
- రాచర్లలో పత్తికి ప్రత్యామ్నాయంగా కొర్రల సాగు
- పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ
- 80 నుంచి 90 రోజుల్లో చేతికి పంట
- స్వల్ప పెట్టుబడితో అన్నదాతకు అండ

రాచర్ల:

మండలంలో కొర్ర పంట పెద్ద ఎత్తున సాగవడం శుభపరిణామమే. పత్తికి ప్రత్యామ్నాయంగా దీనిని పండిస్తున్నారు. పత్తి సాగుకు పెట్టుబడి వ్యయం ఎక్కువ.. పైగా గులాబీ రంగు పురుగు ప్రమాదం పొంచి ఉంటుంది. ఇక చీడపీడలను నివారించాలంటే భారీ ధరకు కొనుగోలు చేసే రసాయన మందులే దిక్కు. ఒకవేళ పురుగు నివారణ జరగకపోతే పత్తి రైతు పీకల్లోతు కష్టాల్లో మునిగి పోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో పత్తికి.. కొర్రలే ప్రత్యామ్నాయంగా తీసుకోవాల్సి ఉంటుంది. స్వల్పకాలంలో పంట చేతికి వస్తుండటం, పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండటం, దిగుబడి ఎక్కువ ఉండటం వల్ల వ్యవసాయ శాఖ కూడా రైతులను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో రాచర్ల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ కొర్ర పంట సాగు ఆవశ్యకత, ఉపయోగాల గురించి వివరించారు.

కొర్ర రకాలు ఇవే..

కొర్రలో ఎస్ఐఏ 3222, సూర్యనంది అనుకూలంగా ఉంటాయి. పంటకాలం 80 నుంచి 90 రోజులు ఉంటుంది. ఏడాది పొడవుగా కొర్ర పంట సాగు చేసుకోవచ్చు. వ్యవసాయ బోర్ల కింద నీటి తడులు కూడా సరిపోతాయి. ఇంకో ఆసక్తికర అంశం ఏమిటంటే ఎండకాలంలో కూడా మంచి నాణ్యత కలిగిన పంట చేతికొస్తుంది. గొర్రుతోనే సాగు చేసుకోవాటానికి వీలు ఉంటుంది. సాలుకు సాలుకు మధ్య దూరం 30 సెంటీ మీటర్లు, మొక్కకు, మొక్కకు మధ్య దూరం 8–10 సెంటీ మీటర్లు ఉండాలి. హెక్టారుకు 8–10 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. హెక్టారుకు 5 టన్నుల పశువుల ఎరువు, 40 కిలోల నత్రజని, 30 కిలోల భాసర్వం ఇచ్చే.. ఎరువులు వాడుకోవాలి. 5 వరుసలు కొర్ర, ఒక వరుస కంది పంటను సాగు చేసుకోవాలి.

నల్లరేగడి భూములూ అనుకూలం

నల్ల రేగడి భూములను రబీలో ఖాళీగా ఉంచకుండా కొర్ర పంట సాగు చేసుకోవచ్చు. కొర్ర స్వల్పకాలిక పంట అయినందున రబీలో శనగ పంట సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొర్ర పంట సాగు వలన పంట మార్పిడి పద్ధతి అనుసరించనట్లే అవుతుంది.

కొర్ర పంట ప్రాధాన్యత

- కొర్ర పంట సాగు చేసుకోవడం వలన పశువుల గ్రాసం కొరత తీరుతుంది.
- కొర్ర పంట తక్కువ వర్షపాతంలోనూ పండుతుంది.
- సేంద్రియ వ్యవసాయానికి కొర్ర అనువైనది.
- చాలా కాలం వరకు ధాన్యాన్ని నిల్వ చేసుకోవచ్చు.
- చీడ, పరుగులు సమస్యలు చాలా తక్కువగా ఉంటాయి.
- కొర్ర పంటను అంతర పంటగా వేసుకోవచ్చు.

అత్యధిక పోషకాలు



కొర్రలకు సంబంధించి 100 గ్రాముల్లో 331 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్స్ 12.3 గ్రాములు, కార్బోహైడ్రేట్‌లు 60.9, కొవ్వు 4.3, పీచు పదార్థం 8.0, మినరల్స్ 3.3 గ్రాములు, కాల్షియం 31 మి. గ్రా, ఇనుము 2.8 మి.గ్రా, పొటాషియం 250 మిల్లీ గ్రాములతో పాటు ఇతర ఖనిజాలు, పోషకాలు ఉంటాయి. రాగి, వరి, గోధుమలకంటే కొర్రలు ఉత్తమం.

షేక్ అబ్దుల్ రఫీక్
వ్యవసాయాధికారి

కార్మికులకు న్యాయం చేయాలి

- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్ర నాథ్ డిమాండ్



విలేకరులు సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

ఒంగోలు టౌన్: చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. జూలై 8వ తేదీ విజయవాడలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశాలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. నగరంలోని మల్లయ్యలింగం భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తానని పవన్ కల్యాణ ఇచ్చిన మాట నిలుపుకోవాలన్నారు. అంగన్‌వాడీల జీతాలు పెంచుతామని లోకేష్ హామీ ఇచ్చారని, వెంటనే జీతాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిన మోదీకి ఉద్యమాల ద్వారా ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పామని, కార్మికులను మోసం చేస్తే ఎవరైనా సరే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని, 2019 నుంచి పనిచేస్తున్న కార్మికులను తొలగించే ప్రయత్నాలను మానుకోవాలని జిల్లా నాయకుడు శ్రీరాం శ్రీనివాసులు కోరారు. ఒంగోలులో ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వెన్నా దంపతులు


వైఎస్ జగన్‌తో వెన్నా హనుమా రెడ్డి దంపతులు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్న హనుమా రెడ్డి ఆయన భార్య తర్లుపాడు జెడ్పీటీసీ వెన్న ఇందిర వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పశ్చిమ ప్రకాశంలో జరిగిన ఎన్నికల సరళి, ఫలితాలు తదితర అంశాలపై మాట్లాడినట్లు చెప్పారు. పార్టీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, కార్యకర్తలకు అండగా ఉండాలని జగన్ తమకు సూచించినట్లు వెన్నా చెప్పారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన నరసింహారావు

దర్శి: ఈ నెల 12న కురిచేడు రోడ్డులో దర్శి మారెడ్డిపల్లి గ్రామం మధ్య ట్రావెల్స్ బస్సు ఢీకొని ప్రమాదంలో గాయ పడిన వ్యక్తి చాగంటి నరసింహారావు (34) శనివారం గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన నరసింహారావు మోటారు సైకిల్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జరిగిన వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలిపోయిన హైస్కూల్ వరండా శ్లాబ్

- త్రుటిలో తప్పిన ప్రమాదం


కూలిన పాఠశాల వరండా శ్లాబ్

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలోని వరండా శ్లాబ్ కూలింది. ఆ సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. మూడు రోజుల క్రితం పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం ప్రారంభమయ్యాయి. సమాచారం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారులు సుబ్బయ్య, హెచ్‌ఎంలు పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. శ్లాబ్ కూలిన ప్రాంతానికి విద్యార్థులు ఎవరూ రాకుండా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని ఎంఈఓ తెలిపారు.

గోవులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఉప రవాణా కమిషనర్ సుశీల

ఒంగోలు టౌన్: బక్రీదు పండుగను పురస్కరించుకుని ఎవరైనా అక్రమంగా గోవులను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గో వధను నిర్మూలించేందుకు రవాణా శాఖ వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. గోవులను రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లారీ యజమానులు గోవులను అక్రమంగా రవాణా చేయరాదని, అలాగే డ్రైవర్లు ధ్రువీకరణ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

టీసీసీ లోయర్ గ్రేడ్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షకు జూలై 1వ తేదీ లోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లో జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 42 రోజుల ట్రైనింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు, అపరాధ రుసుము లేకుండా జూలై 1వ తేదీలోగా రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో జూలై 6వ తేదీ వరకు సంబంధిత కోర్సు ఇన్‌చార్జికి చెల్లించాలన్నారు.

మద్యం మత్తులో కార్పెంటర్ మృతి


మృతిచెందిన అశోక్


రోదిస్తున్న మృతుడి భార్య

కంభం: నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై నుంచి మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి కింద పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కంభంలో చోటు చేసుకుంది. కనిగిరి మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన కోయలకుంట్ల అశోక్ (36) బేస్తవారిపేట మండలం కోనపల్లి గ్రామంలో వివాహం చేసుకొని కంభంలో కార్పెంటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి స్థానిక వాసవీస్కూల్ వెనుక వైపు ఉన్న ప్లాట్లలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం మిద్దెపై మద్యం సేవించి అక్కడి నుంచి కిందకు పడిపోవడంతో మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని భోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దర్శి: కురిచేడు రోడ్డులోని నూతనంగా నిర్మాణంలో ఉన్న రెస్టారెంట్‌కు చెందిన ఓషెడ్‌లో దార పెద్ద రాములు అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం మృతి చెందినట్లు తెలుస్తోంది. చలివేంద్రం గ్రామానికి చెందిన పెద్ద రాములు పెయింటింగ్ పని చేస్తుంటాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి బంధువులను విచారిస్తున్నారు. సమగ్ర దర్యాప్తు చేయాలని దళిత సంఘాల డిమాండ్ పెద్ద రాములు మృతిపై సమగ్ర విచారణ జరపాలని దళిత సంఘాలు నేతలు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, రాచపూడి మోషే డిమాండ్ చేశారు. డీఎస్పీ స్థాయి వ్యక్తితో విచారణ జరపాలని లేని పక్షంలో మృతదేహంతో గడియారం స్తంభం సెంటర్‌లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సెల్‌షాపు యజమానిపై ఆటోవాలా దాడి

ఒంగోలు టౌన్: తన షాపు ముందు అడ్డంగా ఆటో పెట్టవద్దని చెప్పిన సెల్‌షాపు యజమానిపై ఆటోవాలా దాడిచేసిన సంఘటన శనివారం ఒంగోలు నగరంలో జరిగింది. వారిద్దరూ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని సంతపేటకు చెందిన వెంకట నారాయణ ఆర్టీసీ బస్టాండు ఇన్‌గేట్ ప్రధాన మార్గంలో పూజా సెల్ షాపు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఒక ఆటో డ్రైవర్ తన ఆటోను సెల్ షాపు ఎదురుగా నిలిపాడు. షాపునకు ఆటో అడ్డంగా పెట్టడం వలన తన వ్యాపారం దెబ్బతింటుందని, పెద్ద మొత్తంలో అద్దెలు కట్టి దుకాణాలు నిర్వహిస్తున్నామని, ఆటోను పక్కకు తీయాలని సదరు ఆటోవాలాతో షాపు యజమాని చెప్పాడు. అతడు వినలేదు. నీతోపాటు మెల్లకన్ను కలిగిన మరో ఆటో డ్రైవర్ కూడా రోజూ దుకాణం ముందు ఆటో నిలుపుతున్నాడని, తనకు ఇబ్బందిగా ఉందని చెప్పాడు. దాంతో తన తమ్ముడిని మెల్లకన్ను వాడంటూ తిడతావా అంటూ నారాయణపై ఆటోవాలా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో నారాయణకు కంటి మీద, చాతి మీద గాయాలయ్యాయి. ఆ మేరకు పోలీసులకు నారాయణ ఫిర్యాదు చేశాడు.

షాపు యజమానే నాపై దాడి చేశాడు...

పూజా సెల్ షాపు యజమానే తనపై దాడి చేశాడని ఆటో నడుపుకుంటూ జీవించే పేర్నమిట్టకు చెందిన నిమ్మలపల్లి వెంకట రమణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గొడవ సమయంలో తన తమ్ముడు రావడంతో గుడ్డి నా కొడకా అంటూ బూతులు తిట్టాడని, అంతటితో ఊరుకోకుండా దాడి చేసేందుకు వచ్చాడని, అతడిని నెట్టడంతో కిందపడి గాయమైందని చెప్పాడు. నారాయణతో పాటు మహేష్ అనే వ్యక్తి కూడా తమపై దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారిద్దరి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.